ణాలేమిటి? ఎటువంటి పరిస్థితుల్లో అవేర్పడ్డాయి? అన్న వాటి గురించి ఇద్దరూ కూర్చుని చర్చించుకుంటే.. ఆ బీట ఆటోమేటిక్‌గా పూడుకుపోతుంది. అలా కాకుండా 'అహం' కారణంగా మాటలు పెంచుకుంటూ పోతే ఆ చిన్న 'బీట' మొత్తం కోట కూలిపోవడానికి 'మొదల'వుతుంది. అప్పుడు 'ప్రేమ' అనేది అసలు కనిపించదు''

''అవును. నేనూ ఏకీభవిస్తాను. చాలామందికీ విషయం తెలుసు కూడా. అయినాసరే ఎందుకు భార్యాభర్తల మధ్య చిన్నచిన్న కారణాల ఆధారంగానే గొడవలు ప్రారంభమవుతుంటాయంటారు?''ఆమె ప్రశ్నించింది.

''మాట్లాడుకోకపోవడం వల్ల. అవును మనసు విప్పి మాట్లాడుకోకపోవడం వల్ల. ప్రేమించుకునే రోజుల్లోనూ, పెళ్ళైన కొత్తలోనూ ఇద్దరిమధ్య అవగాహన మరింత అధికంగా ఉన్నట్టు అనిపిస్తుంది. తర్వాతర్వాత బాధ్యతలు, వ్యాపకాలు...ఇలా ఏవోకటి పెరగడం, అవగాహన తరగడంతో ఇద్దరి అలోచనల మధ్య 'అంతరం' ఏర్పడుతుంది. అంతే! ఇక చెప్పడానికేముంది, అసంకల్పితంగా 'వార్' ప్రారంభమవుతుంది''

''మీరింత కాలిక్యులేటెడ్‌గా ఖచ్చితంగా చెప్పడానికీ సినిమా కథ వెనుక స్ఫూర్తికీ కారణం ఒకటేనా సుదర్శన్?'' అతడి మొహంలో చూస్తూ ప్రశ్నించిందామె.

''మీరడిగింది కరెక్టేనండి. నా తల్లిదండ్రుల జీవితాలే నాకు స్ఫూర్తి'' అంటూ కళ్ళు మూసుకున్నాడు.

''వాళ్ళు మీదగ్గరే ఉంటున్నారా?''

''లేదండి....చిన్నప్పుడే తల్లికి దూరమయ్యాను. నాకు ఊహ తెల్సినప్పట్నుంచి 'అమ్మ' గురించి అడిగేవాడిని.

జమీందారీ కూతురైన అమ్మకు, ఆస్తిపాస్తుల్లేని అనాథ అయిన నాన్న వ్యక్తిత్వం నచ్చడంతో విపరీతంగా ప్రేమించింది. పెళ్ళికి తాతయ్య ఒప్పుకోకపోతే ''ప్రాణం తీసుకుంటాను'' అని బెదిరించి ఒప్పించింది. సంవత్సరం తిరక్కుండానే ఓ పాప పుట్టింది.

'డబ్బు' అవసరం తెలీకుండా బ్రతుకుతున్న నాన్నతో తాతయ్య ఏదైనా వ్యాపారం చేయిద్దామని పాప బారసాల తర్వాత చెబితే ''బిడ్డ పుట్టిన వెంటనే ఏమిటీ? మనకేం తక్కువ, ఇప్పుడు సంపాదించాలా ఏమిటీ?'' అని అమ్మ ఒప్పుకోలేదు. ఒక్కగానొక్క బిడ్డ అచ్చటాముచ్చటా తీర్చడమే తన ఆనందమనుకున్న తాతయ్య పెద్దగా ప్రతిఘటించలేదు.

అమ్మ ప్రేమ నాన్నలో అలసత్వాన్ని పెంచింది. మరోసారి అమ్మ గర్భవతి అయ్యింది. ఈసారి బాబు పుట్టాడు.

పనిచేయడానికి అలవాటు తప్పిన నాన్న, సులభంగా డబ్బు సంపాదించాలన్న తలంపుతో అమ్మ ద్వారా పెద్దాయన దగ్గర్నుండి పెట్టుబడి తీసుకుని జూదం ఆడడం ప్రారంభించాడు. ఒకోసారి వచ్చి, చాలాసార్లు పోయేది.

'సంపాదన లేనివాడు' అన్న ఫీలింగ్ అమ్మలో ప్రారంభమైంది, అక్కడ్నుంచి వాళ్ల మధ్య 'కమ్యూనికేషన్' తగ్గి.. చివరకు విడిపోవడం జరిగింది. అక్కను అమ్మకు వదిలేసి, నన్ను నాన్న తీసుకుని వెళ్ళిపోయారు.

ఇంత జరిగినా ఎప్పుడూ నాన్న అమ్మలో ప్రేమ గురించే ఎక్కువగా చెప్పారు. అందుకే నాక్కూడా నాన్న వ్యక్తిత్వం అంటే చాలా ఇష్టం. అమ్మంటే అమితమైన గౌరవం. వీళ్ళ స్ఫూర్తితోనే ఈ కథ తయారుచేశాను'' అని తిరిగి ''మొత్తం అర్థమయ్యిందా అక్కా!'' అనడిగాడు.

ఏదైతే తాను ఊహించిందో ఆ కల నిజమేనని ఆమెకు నిర్ధారణ అయి, కళ్ళు తడిబారాయి. లేచి తమ్ముడి చేయి పట్టుకుని పై గదిలోకి తీసుకెళ్లింది.

అక్కడ మంచంపై... అచేతనంగా ఉన్న స్త్రీ మూర్తిని చూడగానే అప్రయత్నంగా అతడి నోటి వెంట ''అమ్మా'' అన్న పదం వెలువడింది.

''చేసినదానికి పశ్చాత్తాపంతో నాన్నమీద దిగులుతో అమ్మ ఇలా తయారయ్యింది. ఎప్పుడూ నాన్నగారి గురించే చెబుతుంటుంది. మీ ఇద్దరి గురించి ఎంతో ప్రయత్నించాను. కానీ వీలుకాలేదు. ఇదిగో ఇన్నాళ్ళకిలా...''

''నాకీ మధ్యనే తెలిసింది'' అని తండ్రికి ఫోన్ చేసి వెంటనే బయల్దేరి రమ్మని అడ్రస్ చెప్పాడు.

తర్వాత సంఘటనలన్నీ వేగంగా జరిగిపోయాయి.

పదినిముషాల్లో నిశ్చల ఊహించుకున్నది నిజమైన పోలరైడ్ కెమేరా ఫోటో తీయగా నిశ్చలచిత్రమై బయటికొచ్చింది.

దాన్ని చూసి నలుగురి నయనాలు ఆనందభాష్పాలు రాల్చాయి.

**- యాళ్ల ఈశ్వర్ (అమలాపురం)**

# కరివేపాకు

ఆ పిల్లని చూడగానే జాలి కన్నా జుగుప్స ఎక్కువగా కలుగుతుందెవరికైనా. తన రూపాన్ని పట్టించుకోకుండా అందరి దగ్గరా నిలబడి చేయి చాచి దీనంగా అడుక్కుంటోంది. ఆమెని చూసి చీదరించుకుంటున్న వారే ఎక్కువ. చిల్లరదానం చేసేవారు తక్కువ. ఇది కాదు పద్ధతి అనుకుందేమో. చీదరించుకున్నా చిల్లరపడేవరకూ కదలడం లేదు. 'ఎలాగైతేనేం తనకి కావాసినవి పైసలు' అనుకుందేమో వాళ్ళు విసిరేసిన పైసల్ని వంగి ఏరుకుంటున్నది.

ఆమెను చూస్తే ఒక కళాత్మకమైన భావన, కరకరలాడే కొత్త నోటు లాంటి ఆలోచన నా మెదడులో తళుక్కుమన్నాయి. దగ్గరకు పిలిచాను ''నేను చెప్పినట్టు చేస్తే పదిరూపాయిలిస్తానన్నాను నోటు చూపిస్తూ. ఆమె కళ్ళు తళుక్కుమన్నాయి. ఆ వెలుగు తగ్గకముందే ఆమె చెయ్యవలసిన పనిచెప్పాను. ఏదేమైనా డబ్బే ప్రధానం అన్నట్టు వెంటనే సరేనంది. నా వెంట తీసుకెళ్ళాను. నా పనై పోగానే డబ్బులిచ్చి ఆమెను పంపేశాను.

★ ★ ★

రాష్ట్రస్థాయి ఛాయాచిత్ర ప్రదర్శన జరుగుతోందా ఆడిటోరియంలో. రాష్ట్రం నలుమూలల్నుంచి రకరకాల దృశ్యాలు వివిధ కోణాల్లో రకరకాల సమస్యలు, కళాఖండాలు, ఆకృతులు, ఆక్రోశాలు ఇలా అవీ ఇవీ అని లేదు. కెమేరా కన్నుకి అమరిన అన్నిటినీ రకరకాల భంగిమల్లో ఛాయాచిత్రాల రూపంలో బంధించారు ఛాయాచిత్రకారులు. వారి వారి ప్రతిభను ప్రదర్శించిన వారంతా వారి వారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బహుమతి ఎవర్ని వరిస్తుందో అని ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఆ ఎదురుచూపులు చూస్తున్నవారిలో నేనూ భాగస్వామినే.

★ ★ ★

''హలో! కంగ్రాచ్యులేషన్స్'' ఫోటో ఎగ్జిబిషన్‌లో ఫస్ట్ ప్రైజ్ వచ్చిన నన్ను అభినందిస్తూ వెల్లువలా ముంచెత్తుతున్న కళారాధకుల కరచాలనాలు, ప్రశంసలు.

''ఎంత సహజంగా, వాస్తవానికి దగ్గరగా ఉన్న ఆ చిత్రీకరణతోనే మీ అభిరుచి ద్యోతకమవుతోంది. ఐనా కుక్కలతో పోటీపడి పెంటమీది ఎంగిలాకుల్లో మెతుకులేరుకునే స్థితిలో ఇంకా మనుషులున్నారా అన్పించి హృదయం ద్రవించి పోయిందనుకోండి. ఎలా దొరికిందండీ మీకా దృశ్యం'' రకరకాల అభినందనలు, ప్రశ్నలు.

ఆ దృశ్యం చిత్రీకరించడానికి నేనెంత కష్టపడిందీ, ఉన్నదానికంటే వేలరెట్లు అధికం చేసి చెబుతున్నాను అడిగేవారందరికీ. వినయం ప్రదర్శించడంలోనూ, ఏదో మీ ఆదరాభిమానాలే గాని నేను సాధించింది ఏమీ లేదనే నిరాడంబర తత్వం నటించడంలోనూ నూటికి నూరు శాతం జాగ్రత్తగా మసలుకుంటూ.

నిజానికి ఆ కళాఖండాన్ని సృష్టించడానికి నేను పడ్డ కష్టమేమిటో నాకు మాత్రమే తెలుసు. కేవలం పదిరూపాయలు ఎరచూపించి ఆ దృశ్యాన్ని కల్పించి చిత్రీకరించాననే నిజం జనానికి తెలియదు. తెలియకూడదు. ఎందుకంటే కొన్ని కొన్ని ట్రేడ్ సీక్రెట్స్ బయటకు చెబితే వాటి విలువ పోతుంది. అందుకే ఆ ప్రశంసల వెల్లువలో తేలియాడుతూ చిరునవ్వుతో సమాధానం చెబుతున్నాను వినయాతి వినయంగా. సాయంత్రం ఆడిటోరియంలో జరిగే సభలో నాకు జరిగే సన్మానం, ఆ సన్మానంతో పాటు వచ్చే భారీ మొత్తంలో నగదుని ఊహించుకుంటున్నాను.

''బాబూ! పావలా ఉంటే దానం చెయ్యరా ఆకలేస్తోంది'' ఎప్పుడొచ్చిందో గానీ పక్కనే నిలబడి ఉందా పిల్ల. ఆ పిల్లని చూడగానే గుర్తించి ముఖం తిప్పుకున్నాను.

అందరూ ఏకకంఠంతో ''ఛీ'' కొడుతున్నారా పిల్లని. ఇంతవరకూ నన్ను మెచ్చుకుంటున్న నేను తీసిన ఫోటో ఆ పిల్లదేనని మాత్రం ఎవరూ గుర్తించలేదు. గుర్తించరు కూడా. ఎదురుగా ఉండే అందవికారాన్ని అసహ్యించుకునే జనం, వాటిని చిత్రాల్లో చూపిస్తే వాటికి అవార్డులు, సన్మానాలు. నేను కూడా సామాజికస్పృహతో బాటూ సంఘ మర్యాద కూడా తెలిసినవాడిని కదా. అందుకే ఆ పిల్లని నా వంతుగా చీదరించుకుని హాల్లోకెళ్లిపోయాను.

**- అయ్యగారి శ్రీనివాసరావు**
**(పార్వతీపురం)**